రోడ్లు అధ్వానం

● డ్రైనేజీ పైపులైన్ వేసి మరమ్మతు చేయని అధికారులు ● వాహనదారులు, పాదచారుల ఇబ్బంది



లక్ష్మమ్మ పార్కు వద్ద మరమ్మతు చేయకుండా వదిలేసిన రోడ్డు



రాంనగర్ పోచమ్మ ఆలయం నుంచి వైఎస్సార్ పార్కుకు వెళ్లే రోడ్డు దుస్థితి



గుంతలమయమైన సౌమ్య ఆస్పత్రి నుంచి రామాలయానికి వెళ్లే రోడ్డు

రాంనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జలమండలి, జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల డ్రైనేజీ పైపులైన్ వేసి రోడ్లకు మరమ్మతు చేయకపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాంనగర్ లక్ష్మమ్మ పార్కు, మదర్స్ స్కూల్ వీధిలో డ్రైనేజీ లైన్లు వేసి రోడ్డు నిర్మించలేదు. రాంనగర్ కూరగాయల మార్కెట్ చౌరస్తా నుంచి వారాసిగూడ వెళ్లే ప్రధాన రహదారిలో, రామాలయం నుంచి సెయింట్ పాయిస్ స్కూల్‌కు వెళ్లే మార్గంలో, అజర్‌గల్లీలో, సౌమ్య ఆస్పత్రి నుంచి రామాలయం వెళ్లే రోడ్డులో డ్రైనేజీ పైపులైన్‌లు వేసి ప్యాచ్ వర్క్ చేయలేదు. బాగ్‌లింగంపల్లి నుంచి నల్లకుంట మార్కెట్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో వరద కాలువ కోసం తవ్వి మరమ్మతులు చేయలేదు. గుంతలమయమైన రోడ్లలో ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న బాగ్‌లింగంపల్లి నుంచి నల్లకుంట మార్కెట్‌కు వెళ్లే రోడ్డు



మదర్స్ స్కూల్ సమీపంలో కంకర తేలిన రోడ్డు



మదర్స్ స్కూల్ సమీపంలో రోడ్డుపై గుంతలు

రోడ్లపై దుమ్ము లేస్తోంది



డ్రైనేజీ పైపులైన్ వేసి ఆ ప్రాంతంలో రోడ్డు ప్యాచ్‌వర్క్ చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆ రోడ్లపై వాహనాల రాకపోకలతో దుమ్ము లేవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలి.

- సంఘం ప్రవీణ్

రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు చేపడతాం

డ్రైనేజీ పైపులైన్లు వేయడం పూర్తయినచోట రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు చేపడతాం. కొత్త డ్రైనేజీ పైపులైన్‌కు కొందరు కనెక్షన్లు కలపడం వల్ల ఇబ్బంది ఏర్పడింది.

- మోహన్‌రావు,
జలమండలి డీజీఎం, చిలకలగూడ



నాలెడ్జ్ సిటీని సందర్శించిన నెదర్లాండ్స్ అంబాసిడర్ మారిసా గెరాడ్స్ తదితరులు

ఇండియాకు ఐటీ హబ్‌గా హైదరాబాద్

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఐటీ రంగంలో హైదరాబాద్ ఇండియాలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు పొందిందని ఇక్కడ పెట్టుబడులకు, ఉపాధికి మంచి అవకాశాలున్నాయని నెదర్లాండ్స్ ఇండియా భూటాన్, నేపాల్ అంబాసిడర్ మారిసా గెరాడ్స్ అన్నారు. బుధవారం ఆమె నాలెడ్జ్ సిటీలోని డచ్‌కు చెందిన జిబియా సీఎంఐటీ, ప్లానెస్ సాఫ్ట్‌వేర్ సంస్థలను సందర్శించారు. జిబియా సీవోవో కిరణ్ మధునాపంతులతో కలిసి డచ్ కంపెనీలలో పని చేస్తున్న ఉద్యోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తాను తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చానని ఇక్కడ వ్యాపార పెట్టుబడులు విస్తరించేందుకు స్థానికంగా ఉన్న పరిస్థితులను అధ్యయనం చేయడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడబోతున్నట్లు తెలిపారు.

పాఠశాల స్నాతకోత్సవంలో విషాదం..

● ఎల్బీ స్టేడియం సంపులో పడి యూకేజీ బాలుడి మృతి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎల్బీస్టేడియంలో పాఠశాల స్నాతకోత్సవానికి వచ్చిన బాలుడు సంపులో పడి మృతి చెందాడు. స్నాతకోత్సవంలో భాగంగా యూకేజీ సర్టిఫికెట్ అందుకున్న బాలుడిని చూసి మురిసిపోయిన తల్లిదండ్రులకు మనోవేదనే మిగిలింది. స్నాతకోత్సవంలో పాల్గొనడానికి ఎల్‌కేజీ విద్యార్థి మహమ్మద్ ఆహిల్(5) తన తల్లి షఫియా సుల్తానా, సోదరుడితో కలిసి వచ్చాడు. మంగళవారం రాత్రి బహుమతి కార్యక్రమం ప్రారంభం అవుతుండగా.. స్టేడియం గేట్ నెంబరు 10, 11 మధ్య బాలుడు తచ్చాడుతూ పక్కనే ఉన్న గోతిలో కాలు పెట్టగా జారి సంపులో పడిపోయాడు. ఆహిల్ కనిపించడంలేదని తల్లి, ఇతరులు వెతుకుతున్నారు. సంపులో చూడగా జారిపడిన ఆనవాళ్లు కనపడడంతో అందులోకి దిగి బాబును బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆహిల్‌ను బషీర్‌బాగ్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.



కార్యక్రమంలో అల్లు స్నేహారెడ్డి, ఆస్పత్రి సీఎండీ డాక్టర్ రమేష్ కంచర్ల తదితరులు

'రెయిన్‌బో'లో బటర్‌ఫ్లై ఎసెన్షియల్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పిల్లలు, మహిళలకు హానికరం కాకుండా ఉండే వస్తువులకు సంబంధించిన బటర్‌ఫ్లై ఎసెన్షియల్‌ను రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రిలో అల్లు స్నేహారెడ్డి బుధవారం ప్రారంభించారు. పిల్లలు, మహిళలకు సంబంధించి పూర్తి ఆర్గానిక్ పదార్థాలతో తయారైన ఉత్పత్తులనే ఇక్కడ అందుబాటులో ఉంటాయని రెయిన్‌బో చిల్డ్రన్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ రమేష్ కంచర్ల వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆదర్శ కాంచర్ల, డాక్టర్ ప్రణతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మెగా హెల్త్ క్యాంప్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ (లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్) విభాగాల్లో పని చేస్తున్న హోంగార్డ్ ఆఫీసర్లకు నిర్వహించిన మెగా హెల్త్ చెకప్ శిబిరం బుధవారం ముగిసింది. క్యాంపు నిర్వాహకులు, మెడికవర్ ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ డా. దుర్గేష్ శివ, మెడికవర్ ఆస్పత్రి సిబ్బంది, సీటీసీ డాక్టర్లు సరిత, సుకుమార్ తదితరులను సీపీ అవినాష్ మహంతి అభినందించారు. కార్యక్రమంలో సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ నర్సింహ కొత్తపల్లి, పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందితో పాటు వైద్య బృందం పాల్గొన్నారు.

మెడికల్ బిల్లులు అందక జేఎన్‌టీయూ ఉద్యోగుల గగ్గోలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): వైద్యానికి సంబంధించిన బిల్లులు సమర్పించి నెలలు గడుస్తున్నా మంజూరు చేయకపోవడంపై జేఎన్‌టీయూలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు, పెన్షనర్లు ఆవేదన వ్యక్తం చేశారు. జేఎన్‌టీయూ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీ రిజిస్ట్రార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తక్షణమే బిల్లులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో మాజీ ఫైనాన్స్ ఆఫీసర్ చంద్రశేఖర్, మాజీ డిప్యూటీ రిజిస్ట్రార్ ప్రసాద్ తదితరులున్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన కార్మిక విభాగం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు

బాలానగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఏ. శారదారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీనామా పత్రాన్ని మాజీ మంత్రి కేటీఆర్‌కు పంపినట్లు ఆమె చెప్పారు. కొన్ని సంవత్సరాలుగా కార్మికులకు, కార్మిక నాయకులకు పార్టీపరంగా అవమానాలు జరుగుతున్నాయని, అవమానాలను ఎదుర్కొంటూనే మౌనం వహించానని తన ఆవేదనను వ్యక్తం చేశారు.

విద్య కోసం బడ్జెట్ కేటాయింపులను పెంచాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆల్‌ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌ఓ) హైదరాబాద్ జిల్లా 10వ విద్యార్థి మహాసభ బుధవారం జరిగింది. లక్డీకాపూల్‌లోని సామ్రాట్ కాంప్లెక్స్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఈ మహాసభలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య వక్తగా ప్రముఖ రచయిత డాక్టర్ రాపోలు పాల్గొని మాట్లాడారు. నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు జె.మల్లేష్‌రాజ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యాభివృద్ధికి సరిపడా నిధులు మంజూరు చేయలేదని అన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ అధికారి చందన సర్వే

జాతీయ క్రీడలకు బోయిన్‌పల్లి విద్యార్థులు

బోయినపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ భోపాల్‌లో నిర్వహించనున్న ట్రైబల్ వెల్ఫేర్ జాతీయస్థాయి క్రీడా పోటీలకు తెలంగాణ నుంచి బోయినపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ వాటర్ స్పోర్ట్స్ ప్రభుత్వ అకాడమీ విద్యార్థులు 23 మంది ఎంపికయ్యారు. తెలంగాణ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు చందన సర్వే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, లాలూనాయక్, హెచ్‌డబ్ల్యూఓ నీలిమ, కోచ్ భూపాల్ పాల్గొన్నారు.

కేసు వాపసు తీసుకోవాలని బెదిరించిన భర్తపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గతంలో పెట్టిన కేసు వాపసు తీసుకోవాలని లేదంటే చంపేస్తానంటూ కట్టుకున్న భార్యను, కుమారుడిని బెదిరిస్తున్న ఓ వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. లక్ష్మీనర్సింహనగర్‌కు చెందిన విజయమ్మ, రామచంద్రయ్య భార్యాభర్తలు. పది నెలల క్రితం రామచంద్రయ్య భార్యను కర్రతో కొట్టాడు. గాయపడ్డ ఆమె కుమారుడు శివశంకర్‌తో కలిసి ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. జైలు నుంచి వచ్చాక రామచంద్రయ్య భార్య పిల్లలతో ఉంటున్నాడు. ఇటీవల తనపై పెట్టిన కేసును విత్‌డ్రా చేసుకోవాలని భార్యపై ఒత్తిడితేవడం మొదలుపెట్టాడు. భార్య ఊరెళ్లిన సమయం చూసుకొని కుమారుడిని చంపేస్తానంటూ బెదిరించాడు. విజయమ్మ ఫిర్యాదుమేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నారు.

అసెంబ్లీ ప్రాంగణంలో

జ్యోతీరావు పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఆవరణలో జ్యోతీరావు పూలే, సావిత్రిబాయి విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇందిపార్కు ధర్నా చౌక్‌వద్ద వెనుకబడిన తరగతుల జాతీయ కమిటీ ఆధ్వర్యంలో శాంతి దీక్ష చేపట్టారు. వెనుకబడిన తరగతుల జాతీయ కమిటీ చైర్మన్ ఎం. భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీసీ సంఘాల నేతలు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ.. రాజకీయాలు, మతాలకు అతీతంగా పూలే దంపతులను చూడాలని, వారి విగ్రహాలను అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసి గౌరవించుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. ఎం. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజాభవన్‌కు మహాత్మా జ్యోతీరావు పూలే పేరు పెట్టడం శుభపరిణామమని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయని బీఆర్ఎస్ నేతలు, కవిత అధికారం కోల్పోయిన తర్వాత పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని రాజకీయాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కోఠి ఉమెన్స్ కళాశాలకు సావిత్రి బాయి పూలే కళాశాలగా నామకరణం చేయాలని కోరారు. కమిటీ నేతలు కె. అచ్చయ్య, రచ్చ శ్రీనివాస్, వి. ధానకర్ణాచారి, చిన్నయ్య, మంజులత, అంబిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

అధికారం కోల్పోయాక గుర్తొచ్చారా..

బర్కత్‌పుర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయాక జ్యోతీరావు పూలే దంపతులు ఎమ్మెల్సీ కవితకు గుర్తొచ్చారా అని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ ప్రశ్నించారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలని ఉద్యమం చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. బుధవారం బర్కత్‌పురలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పిన్నమనేని సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు వద్ద టీడీపీ నేతలు నోటికి నల్లరిబ్బన్లు కట్టుకొని మౌన దీక్ష చేపట్టారు. సాయిబాబాతోపాటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు మద్దతు ప్రకటించారు. ఎన్టీఆర్ తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థను రద్దు చేసి మండల వ్యవస్థను ఏర్పాటు చేశారని, గురుకుల పాఠశాలలను స్థాపించి విద్యావ్యాప్తికి కృషి చేశారని సాయిబాబా కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి శతజయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మౌనదీక్షలో ఎన్టీఆర్ అభిమాన సంఘాల నేతలు శ్రీపతి సతీష్, నాగు నాగేష్, ఎస్. ప్రకాష్, అప్పారావు, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ఇందిరాపార్కు వద్ద మౌన దీక్ష చేస్తున్న టీడీపీ నేతలు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

ముగిసిన హరికథా మహోత్సవం

రాంనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో నల్లకుంట శంకరమఠంలో జరుగుతున్న హరికథా మహోత్సవ ముగింపు కార్యక్రమం బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా శ్రీసీతారామ కల్యాణం హరికథా గానం గరిమెళ్ల సత్యవతిచే జరిగింది. ముఖ్యఅతిథులుగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అశ్విని గ్రూప్ సంస్థ చైర్మన్ అశ్విని సుబ్బారావు, మహతి ఇన్‌ఫ్రా సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ వై.రవిశంకర్, శ్రీడెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ భోగరాజు మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఏఎస్ విశ్రాంత అధికారి కేవీ రమణాచారిని సత్కరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఇనాక్, కళా జనార్దనమూర్తి తదితరులు

కళల అభివృద్ధికి గానసభ కృషి అద్వితీయం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కళలు, సాహిత్యం అభివృద్ధికి త్యాగరాయగానసభ చేస్తున్న కృషి అద్వితీయమైందని వేంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఐఏఎస్ మాజీ అధికారి డా. కేవీ రమణాచారి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో సాహిత్య కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ప్రముఖ కవి రఘుశ్రీ రచించిన కవీంద్ర మోక్షకు నిర్మల చేసిన హిందీ అనువాద సంపుటి ఆవిష్కరణ, కవి సమ్మేళనం నిర్వహించారు. ఆచార్య ఇనాక్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ.. రమణాచారి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని గానసభ బుర్రకథ వంటి కళాకారులను ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, సినీ దర్శకుడు లక్ష్మణరేఖ గోపాలకృష్ణ, కవి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రఘుశ్రీ కవిసమ్మేళనం నిర్వహించారు. వెంకటస్వామి, కనకాచారి, బాలగంగాధరయ్య తదితరులు స్వీయ కవితలు చదివారు.

గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలి

రాంనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గ్రామీణ భారత్‌బంద్ పోస్టర్‌ను బుధవారం విద్యానగర్ మార్క్స్ భవన్‌లో ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు బి.ప్రదీప్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం : కార్పొరేటర్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అన్నారు. బుధవారం శాస్త్రినగర్ అధ్యక్షుడు సూర్యతో కలిసి చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.

నల్లకుంట: చలో అభియాన్ కార్యక్రమం నల్లకుంటలో బుధవారం నిర్వహించారు. పాత రామాలయం వీధిలో బూత్ నెంబర్ 4 అధ్యక్షుడు మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో నమో యాప్, వికసిత భారత్‌పై ప్రజలకు నేతలు అవగాహన కల్పించారు.

వారం రోజులుగా అక్కడే దీక్ష

చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వుల పేరిట ఇళ్లను అక్రమంగా కూల్చివేశారని, పునరావాసం కల్పించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ స్వామివివేకానందనగర్ బస్తీ బాధితులు వారం రోజులుగా దీక్ష చేస్తున్నారు. దళిత బహుజన ఫ్రంట్ నేతలు వారికి మద్దతు ప్రకటించారు. బుధవారం దీక్షా శిబిరంలో బాధితులతో కలిసి భోజనం చేశారు. శంకర్, పులి కల్పన, సచిన్, కవిత పాల్గొన్నారు.



బాధితులతో కలిసి భోజనం చేస్తున్న డీబీఎఫ్ నాయకుడు శంకర్

కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలి

ముషీరాబాద్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కలుషిత నీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జలమండలి డీజీఎం మోహన్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు.పటాన్ బస్తీ, బాపూజీనగర్, రేడియంట్ హైస్కూల్ వీధి, వైఎస్ఆర్‌పార్కు వీధిలో కలుషిత నీటి సరఫరాతోపాటు నిత్యం డ్రైనేజీలు పొంగుతుండంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

తునికాకు టెండర్లు నిర్వహించాలి

రాంనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తునికాకు టెండర్లు నిర్వహించాలని, 50 ఆకుల కట్టకు రూ. 5 నిర్ణయించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నేతలు డిమాండ్ చేశారు. బుధవారం మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డోబ్రియల్‌కు ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న వినతిపత్రం అందజేశారు. జీవో నెంబర్ 1414ని రద్దు చేసి కాంట్రాక్టర్ల నుంచి రాయల్టీ వసూలు చేసి కూలీలకు బోనస్ చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేఎంఎస్ నేతలు

నల్లకుంటలో రూ. 13 లక్షలతో డ్రైనేజీ పైపులైన్

నల్లకుంట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో పైపులైన్‌ల ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం నల్లకుంట డివిజన్‌లో రూ. 13 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్పొరేటర్ యాకర అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

సేవారత్న నేషనల్ అవార్డుకు సీహెచ్ లక్ష్మీకాంత్ ఎంపిక


కవాడిగూడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బహుజన సాహిత్య అకాడమీ ప్రతియేటా అందజేస్తున్న సేవారత్న నేషనల్ అవార్డు-2024కు ఆలిండియా దళిత్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మీకాంత్ అలియాస్ సునీల్ ఎంపికయ్యారని జాతీయ అవార్డు కమిటీ ప్రకటించింది. అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్, బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అవార్డు ఆహ్వానపత్రాన్ని లక్ష్మీకాంత్‌కు బుధవారం అందజేశారు. ఈనెల 11న ఆంధ్రప్రదేశ్ తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ ఏడవ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో అవార్డు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. బీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎం. గౌతమ్, రాష్ట్ర కో-ఆర్డినేటర్ హనుమాండ్ల విష్ణు పాల్గొన్నారు.

మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎలిజాల ప్రవీణ్ జయప్రకాష్ నియామకం

కవాడిగూడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎలిజాల ప్రవీణ్ జయప్రకాష్ నియమితులయ్యారు. బుధవారం సంస్థ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయవాది, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు సి. యాదగిరి, మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా దేవందర్‌రావు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె. అనిత తదితరులు పాల్గొన్నారు.

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి న్యూస్ ప్రెజెంటర్‌కు ప్రతిభా పురస్కారం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానల్ న్యూస్ ప్రెజెంటర్ యం. నవీన్‌కుమార్‌కు ప్రతిభా పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు లోకం కృష్ణయ్య తెలిపారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎ. రామలింగేశ్వరరావు పురస్కారం ప్రదానం చేస్తారని వివరించారు.



నవీన్‌కుమార్

ఎంఎంటీఎస్ రైలులో గుర్తుతెలియని మహిళ మృతి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలులో గుర్తుతెలియని మహిళ మృతి చెందింది. హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. 60 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని మహిళ ఎంఎంటీఎస్ రైలు బోగీలో చనిపోయింది. ప్రయాణికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి : ఏబీవీపీ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పృథ్వితేజ డిమాండ్ చేశారు. బుధవారం నిజాం కళాశాల వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు దాదాపు 30 మంది ఏబీవీపీ కార్యకర్తలను అరెస్టు చేసి గోషామహల్, అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. పృథ్వితేజ మాట్లాడుతూ.. ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే ముఖ్యమంత్రితోపాటు మంత్రుల పర్యటనలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఏబీవీపీ నాయకులు ప్రణయ్, నవీన్, ఇబ్రహీం, విక్రమాదిత్య, రామకృష్ణ తదతరులు పాల్గొన్నారు.